## ఇంద్రధనుస్సు

"లక్ష్మణపంతులు" అంటే మా సోదరుల్లో కడసారపతడు. మా అమ్మా మా నాన్నా కనపడనట్టే అతడును కనబడ్డంలేదు ఈ లోకంలో ఇప్పుడు. అతడు కాలంచేసి నేటికి పాతికేళ్ళవుతుంది. స్వర్గలోకంలో అతనిప్పుడు మంచి యౌవనంలో దేదీప్యమానంగా వున్నాడని నా నమ్మకం.

అతనికి పోయేటప్పటికి ఈ లోకంలో ఇరవైమూడో—ఇరవై నాలుగో వయస్సు. ఇప్పుడూ అక్కడ అతనికదే వయస్సు అయివుంటుంది. ఇది పిచ్చినమ్మకంగాదు. పోయినప్పుడతను తిన్నగా స్వర్గం చూరగొంటూ అక్కడ శిశువై పెరిగినా యిప్పుడతని కక్కడ పాతికేళ్ళూ వుంటాయి. లేక ఏలావున్నా వాడల్లా స్వర్గంలో ప్రవేశించి నిత్య యౌవనం తతిమ్మా దేవలోకంతోపాటు భుజిస్తూవున్నా ఆ పాతికేళ్ళూ ఆలా వుంటాయి. ఏలా లెక్కించినా పాతికేళ్ళే.

అతడు 1916 నుంచీ పోయేవఱకూ ఏదో "డయిరీ" అనగా దినదినం ఆత్మీయపుచర్య వ్రాసి వుంచుకొన్నట్టు కనిపిస్తుంది. చిత్తుకాగితాల్లో అతను పోయినవెనుక అతని వ్రాతప్రతి ఒక చిన్న నవల, కొన్ని పాఠశాల వ్యాసాలు కనిపించినాయి. వాటి సిరా చినుగూచూస్తే ఉంచదగ్గవికావు. పారవేయవలసినవే అని అనిపిస్తుంది. కాని—అట్టేపెట్టాను ! ఎందుకూ అంటే ఏంచెప్పను ? పారవేయలేక.

కాని అతని శరీరం ? ఏంచేశాం ? ఉంచలేకపోయినాం. ఈజిప్టుదేశస్థులు పూర్వం 'మమ్మీ' లుగాజేసి జాగర్తపెట్టింది ఏనాటిమాటో ? ఇప్పటివాళ్లకు ఆ నేర్పూ ఆ ఓర్పూ రెండూ

కూడా లేవు అనుకుంటాను. ఇప్పటి ప్రతివ్యక్తీ "ఉంచడంవల్ల వచ్చే ప్రయోజనం ఏమిటి?" అని పెదవి విరిచేవ్యక్తే. పరే తంతో మాట్లాడలేడు. పరేతాన్ని ప్రేమించలేడు. కాని అతని స్వర్గాన్నిగురించి ఇట్టేకొనియాడుతూ ప్రసంగం సాగించగలడు! అదే నాకాశ్చర్యం వేస్తూవుంటుంది. ఇక్కడ శరీరాన్ని తగల వేసి స్వర్గంలో మన శరీరాలు వజ్రపిప్పళ్లలా మెఱిసిపోతూ వున్నాయని అనుకోవడం నా కత్యాశ్చర్యం గొల్పుతూవుంటుంది!

అయితే ఈ స్వర్గాన్ని గురించిన ఆలోచనా, వేదాంతం మా అమ్మమ్మకు వుండేదికాదు. తెల్లారింది మొదలు మళ్ళా తెల్లారేదాకా "తల్లిలేని పిల్లవాడు—మూడేళ్ళప్పుడే వీడికి తల్లి పోయింది——" అనుకుంటూ ఆ మనుమణ్ణి పెంచి పెద్దవాణ్ణిచేసి, తాననుకున్నంత వొడ్డూపొడుగూ గల వాణ్ణిగా తయారుచేయ గలిగింది.

మరి అతడు పోయిననాటిరాత్రి ఆమె పడ్డ దుఃఖానికీ శ్రమకూ అంతూ పొంతూలేదు. "ఈ పాటికి వదలి వేయ వమ్మా ఆ కట్టెను. ఎంతసేపేడ్చినా రాడు రాడు!" అంటూ ఆమె చేతుల్లోంచి ఆ కట్టెను తప్పించడం తల్చుకుంటే లోక హృదయం విదారితం కాకుండా వుంటుందా?

"ఎక్కడికి పోతున్నావుబాబూ! నీతో నన్ను కూడా తీసుకుపోబాబూ!" అని ఆమె ఆ కట్టెను అడుగుతూ నిలువునా నీరైపోయింది. అప్పటి ఆమె కన్నీళ్ళల్లో ఓ ఇంద్రధనుస్సు వంపు కరిగిపోనిది విరిగి పడనిది నీరవంగా అమరినట్టై ఏదో మేఘాన్ని వున్న ఇంద్రధనుస్సును ఆలా ఆలా దవుదవులకు

జరిపివేస్తూ మా లక్ష్మణపంతులు స్వర్గానికి తెట్టతెన్ను పెట్టింది. రెండో ఇంద్రధనుస్సు మన అందరి కన్నీటి బిందువుల గుండా రంగులూనింది గాదుగదా ?

.... .... .... .... ....

## సిల్హౌటీ నృత్యాలు

ఇంట్లో మా అమ్మకు ఎటువంటి పవిత్రస్థానముండేవో ఊళ్లో మా తండ్రికి అటువంటి పేరుకీర్తులు వుండి వున్నాయి. నా తండ్రిన్నీ యిప్పుడులేడు. మేము మా తండ్రిని "నాన్న" అని పిలిచేవాళ్ళము. ఆ మహామహుఁడు 1919 ఫిబ్రవరిలో కాలంచేసినాడు. అప్పటికి నేను పెరిగి పెద్దవాణ్ణై విద్యాబుద్ధులు కలవాణ్ణైయున్నాను. అయినప్పటికీ నా జ్ఞానం నా విద్య నా బుద్ధి నా ఎదుగు నా ఏపు ఆనాడు కించిత్తూ నాకు వుపకరించలేదు.

ఆయన చాలా జబ్బుస్థితిలోనున్నాడు. అయినప్పటికీ "తండ్రి చనిపోతాడు" అనే విజ్ఞానం వివేకం నాలో అప్పటికి పుట్టివుండలేదు. తరువాతను పుట్టివుండిన్నీ ప్రయోజనకారి కాలేదు. ఎంచేతా అంటే తండ్రిని బ్రదికించుకునే అవకాశం మరి వమ్మయి పోయింది కాబట్టి. నేను చూడకుండానే ఆయన భౌతికం దహనపరుపబడింది.

"చూడకుండానే" అన్నానా ? అది సరియైన నివేదిక కాదు. చూచాను ! ఏమిచూచాను ? ఒకవైపున మహాజ్యోతి చూచాను ! ఆ వైపున అసలు మా వూరికి శ్మశానవాటిక లేనే లేదు. ఎప్పుడు ఆ వైపున కనబడ్డా నాకు ఎఱ్ఱని సూర్యాస్తమానమే